

జింక్ ఆంజనేయస్వామి ఆలయ ముఖద్వారం

45 అడుగులు ఆంజనేయస్వామి విగ్రహం

తొలుత పాకలో ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించి పూజలు చేసేవారు. కాలక్రమంలో భక్తుల సహకారంతో రెండు ఎకరాల స్థలంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. అంతేకాకుండా, ఆ ప్రమాదకరమైన మలుపు వద్ద సుమారు 45 అడుగుల ఎత్తైన భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని భక్తులకు అభయమిచ్చే విధంగా నెలకొల్పారు. జింక్ పరిశ్రమ స్థలం ఆవరణలో ఉండటంతో, నాటి ప్రమాదాల కేంద్రం కాస్తా నేడు జింక్ ఆంజనేయస్వామి ఆలయ కేంద్రంగా మారింది. ప్రతి మంగళ, శనివారాల్లో ఇక్కడ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. హనుమాన్ జయంతి, శ్రీరామనవమి వంటి పండగల్లో విశేష పూజలు జరుగుతాయి. ప్రస్తుతం ఈ దేవస్థానం రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఒకప్పుడు భయానకమైన మలుపు నేడు భక్తులకు శాంతిని, భద్రతను ప్రసాదిస్తున్న ఒక పవిత్ర క్షేత్రంగా విరాజిల్లుతోంది.



45 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

నాడు భయం..భయం
నేడు భక్తిభావం

ప్రమాదాల మలుపు నుంచి ప్రశాంత క్షేత్రంగా హిమాచల్ నగర్

ఆలయం ఏర్పాటుతో ప్రమాదాలు తగ్గుముఖం

మల్కాపురం: సుమారు అర్ధ శతాబ్దం క్రితం హిమాచల్ నగర్ సెంటర్ అంటే వాహనదారులకు ఒక భయానకమైన ప్రదేశం. ఆ మలుపు ఎప్పుడు ప్రమాదానికి దారితీస్తుందోనని ఆందోళన చెందేవారు. ఆ సెంటర్‌ను దాటితే చాలు, వాహనదారులు ఊపిరి పీల్చుకునేవారు. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అక్కడ వెలసిన ఆంజనేయస్వామి ఆలయం కారణంగా ప్రమాదాలు దాదాపు 90 శాతం వరకు తగ్గాయని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు. జీవీఎంసీ 58వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ సేవా మార్గం దిగువన, హిమాచల్ నగర్ సమీపంలోని అండాలమ్మ కళాశాలకు వెళ్లే మలుపు ఒకప్పుడు ప్రమాదాలకు నిలయంగా ఉండేది. దాదాపు 54 ఏళ్ల క్రితం ఇక్కడ నిత్యం బస్సులు, లారీలు ప్రమాదానికి గురయ్యేవి. మల్కాపురం నుంచి గాజువాకకు–గాజువాక నుంచి మల్కాపురం రావడానికి అప్పట్లో ఒకే బీటీ రోడ్డు మార్గం ఉండేది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో అనేక పరిశ్రమలకు లారీలు తరచూ వచ్చేవి. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు కూడా తిరిగేవి. ఆ రోజుల్లో ద్విచక్ర వాహనాల వినియోగం తక్కువగా ఉండి, సైకిళ్ల వాడకం ఎక్కువగా ఉండేది. అయితే అండాలమ్మ కళాశాల మలుపు వద్ద గాజువాక నుంచి మల్కాపురం వైపు వెళ్లే వాహనాలు, మల్కాపురం నుంచి గాజువాక వైపు వచ్చే వాహనాలు తరచూ ఢీకొనేవి. భారీ వాహనాలు సైకిళ్లపై వెళ్లేవారిని ఢీకొట్టేవి. నెలలో కనీసం పది ప్రమాదాలైనా జరిగేవని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు.

ఆ మహా వృక్షమే కాపాడింది

అప్పట్లో ఆ మార్గంలో పెద్ద పెద్ద వృక్షాలు ఉండేవి. ఆ చెట్లపై దుష్ట శక్తులు ఉండటం వల్లే ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు భయపడేవారు. ఈ నేపథ్యంలో 1972లో బీహెచ్‌పీవీ సంస్థకు చెందిన కార్మికులను తరలిస్తున్న ఓ బస్సు ఇదే మలుపు వద్ద లోయలో పడిపోయింది. అలా పడుతున్న సమయంలో ఆ బస్సు ఒక పెద్ద చెట్టును ఢీకొని ఆగింది. ఆ చెట్టు వద్ద ఆంజనేయస్వామి విగ్రహం ఉండటాన్ని బస్సులో ఉన్న కార్మికులు గమనించారు. వారు ఆ విగ్రహాన్ని బయటకు తీసి అక్కడే ప్రతిష్ఠించారు. ఆ స్వామి తమను ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడారని భావించి వారంతా పూజలు చేశారు. అలా వారిలో ఆ స్వామిపై విశ్వాసం పెరగడంతో ప్రమాదాలు కూడా తగ్గుముఖం పట్టాయి.



ప్రమాదాల సెంటర్‌గా పిలవబడే హిమాచల్‌నగర్ కూడలి ఇదే..

క్లుప్తంగా

మానవత్వానికి మద్దతు తెలపండి



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నార్త్ ఇండియన్స్

మల్కాపురం: ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని.. మానవత్వానికి అంతా మద్దతు తెలపాలని 60వ వార్డు ప్రాంతానికి చెందిన నార్త్ ఇండియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.నార్త్ ఇండియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్ట్‌లపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ.. మృతులకు నివాళులర్పిస్తూ ఆదివారం గుల్లలపాలెంలో ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఉగ్రవాదులను క్షమించరాదని,ఇలాంటి వారికి ఆశ్రయం కల్పిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దాడిలో అమరులైన పౌరులకు వారు నివాళులర్పించారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ



శ్రీరామ్‌నగర్‌లో చిరు వ్యాపారికి గొడుగు అందిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ఎండలు మండుతున్న నేపథ్యంలో ఆరుబయట వ్యాపారులు చేసే పేదలకు జేడీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాలైన చంద్రనగర్, యల్లపువానిపాలెం, కొత్తపాలెంలో చిరు వ్యాపారులకు ఎండ, వర్షాల నుంచి రక్షణగా ఉండే విధంగా గొడుగులను అందించారు. గొడుగుల వల్ల ఎంతో మేలు కలుగుతుందని చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎర్నిమాంబ ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ విద్యాసాగర్, ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు

మల్కాపురం: ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చునని మల్కాపురం సీఐ విద్యాసాగర్ అన్నారు. సెయింట్ ఆన్స్ మహిళ కళాశాల యామజమాన్యం ట్రాఫిక్ నియమాలతో ముద్రించిన షైన్ బోర్డులను ఆదివారం సీఐ విద్యాసాగర్, ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావుకు అందజేశారు. సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ నేటి యువత ద్విచక్ర వాహనాలపై అతి వేగంగా ప్రయాణిస్తే ప్రమాదలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రమాదాల్లో యువతే ఎక్కువ మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది,కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి మారువారం



నూకాంబిక అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని నూకాంబిక అమ్మవారి మారువారం పండగను వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భారీ బాణసంచాతో తప్పెటగుళ్లతో నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫోకస్

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధిలోని కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం యూపీహెచ్‌సీ ప్రహరి గోడకు అనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎటువంటి రక్షణ గోడ లేకపోవడంతో పాటు, ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్ల ఊడిపోయి రోడ్డుపై ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈ ప్రాంతం గుండా రాకపోకలు సాగించే పాదాచారులు, పాఠశాల విద్యార్థులు , రోగులు భయాందోళనల మధ్య ప్రయాణం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాకరలోవలో అంధకారం



కాకరలోవలో వెలగని వీధిలైటు

జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలోని మీసేవ సెంటర్ వద్ద వారం రోజుల నుంచి వీధి లైట్లు వెలగకపోవడంతో అంధకారం అలముకుంటోంది. చీకటి పడితే వీధుల్లో రాకపోకలు సాగించడానికి భయమేస్తుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –సింథియా

విద్యుత్ వైర్ల సమస్య పరిష్కారం



విద్యుత్ స్తంభంపై వైర్లను సరి చేస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డులోని హనుమాన్‌సంజీవ్‌కాలనీ ప్రాంతంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. బలమైన గాలులకు సైతం తెగిపడేలా ఉన్న ఈ వైర్ల కారణంగా కాలనీ వాసులు తీవ్ర ఆందోళన చెందేవారు. శ్రీహరిపురం విద్యుత్ కేంద్ర కార్యాలయ అధికారులకు స్థానిక నాయకుడు మాత శ్రీను వినతిపత్రం ద్వారా సమస్యను వివరించాడు. దీంతో అధికారులు స్పందించారు. ఆదివారం విద్యుత్ వైర్లను క్రమబద్ధీకరించారు. అంతేకాకుండా, శిథిలమైన పాత వైర్లను తొలగించి, వాటి స్థానంలో కొత్త వైర్లను అమర్చారు.

సూచీ బోర్డులు సరి చేయరూ!



నేలకొరుగుతున్న యారాడ సూచీబోర్డు

సింథియా: యారాడ బీచ్‌కు వెళ్లేందుకు మార్గం చూపించే సూచీబోర్డు కనుమరుగయ్యే పరిస్థితిలో ఉంది. మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి చింతల్లోవ మీదుగా యారాడ వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన సూచీ బోర్డులు నేలకొరిగిపోయాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా భవన నిర్మాణ సామగ్రి వేయడంతో వాటి బరువుకు ఈ సూచీ బోర్డులు నేలకొరిగిపోయాయి. దీంతో యారాడ బీచ్‌కు వెళ్లే పర్యాటకులకు మార్గం తెలియక తికమకపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై వేసిన భవన నిర్మాణ సామగ్రిని తరలించాలని, సూచీ బోర్డులను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నయన మనోహరంగా నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాట్య ప్రదర్శనలు జరిగాయి. ముగింపు వేడుకలను ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు, విశిష్ట అతిథి ఎస్ఎంఎస్ డెంటల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ డాక్టర్ శ్రీధర్, కూచిపూడి కళాక్షేత్ర జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ కూచిపూడి నృత్య గురువు, నాట్య కళాకారిణి టేకుమల్ల శ్యామల సీతారాం స్వామికి విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రదానం చేసిన నాట్య శిరోమణి అవార్డును అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నగరంలో ఉన్నటువంటి నాట్య గురువుల శిష్యులు 300 మంది చిన్నారులతో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. నాట్య ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులకు అతిథుల చేతుల బహుమతులు ప్రదానం చేశారు. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి, గోపీనాథ్, కన్నం వెంకటరమణల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.

కుటుంబం చెంతకు ఉత్తర్‌ప్రదేశ్ మహిళ

సీతమ్మధార: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బంద జిల్లాకు చెందిన దౌన్సార్ గ్రామ నివాసి షియాపతి (36)కు ఒక కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం ఆరు నెలల గర్భవతిగా ఉంది. భార్యాభర్తల మధ్య గొడవతో మనస్థాపానికి గురై నాలుగు నెలల క్రితం ఇల్లు వదిలేసి వచ్చింది. వైజాగ్ రైల్వేస్టేషన్‌లో ఆమె తిరుగుతుండగా ఏయూటీడీ సిబ్బంది గుర్తించి మహిళా షెల్టర్ హోంలో ఆశ్రయం కల్పించారు. ఆమె భర్త, చౌకీదార్ అయిన రాంప్రసాద్‌కు ఫోన్ చేసి షియా ఆరు నెలల గర్భవతి అని చెప్పి అతన్ని ఒప్పించి శ్రద్ధా బృందం సహాయంతో వైజాగ్ నుంచి తీసుకెళ్లి అతనికి అప్పగించారు. శ్రద్ధా సోషల్ వర్కర్లు నీలం, వీణ షియా దంపతులు ఇద్దరికీ కౌన్సెలింగ్ చేశారు. రెండు నెలలకు సరిపడా మందులిచ్చి వచ్చినట్లు తెలిపారు.

బహుజనులు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు కేఎస్ చలం

అల్లిపురం: బహుజనులు ఐక్యమై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలైన కుల నిర్మూలన స్టేట్ సోషలిజం సాధించాలని విశ్రాంత ఆచార్యులు కేఎస్ చలం అన్నారు. ఆదివారం నగరంలో ఒక హోటల్‌లో జరిగిన భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భారతీయ అంబేడ్కర్ సేన ముసాయిదా ప్రణాళికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్ర, ఆర్థిక అంశాలను సోదాహరణగా విశ్లేషించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేన వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్, దుర్గం సుబ్బారావు, బాస్ రాష్ట్ర అధ్యక్షుడు యు. గణపతి, రాష్ట్ర కమిటీ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, పల్లం తాతయ్య, ముత్యాల మోహన్, మోహన్‌రాజు, పూలతోట కృష్ణ, నీరుగొట్టి రమణ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.